క్లుప్తంగా

కాళీమాతను దర్శించుకున్న శివకుమార్



తెనాలి: దసరా పర్వదినం సందర్భంగా జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో స్థానిక శివాజీచౌక్‌లో గల శ్రీకాళీమాత ఆలయంలో మంగళవారం రాత్రి జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌తోపాటు, తాడిబోయిన రమేష్, కౌన్సిలర్ ఆవుల కోటయ్య, నక్క వెంకటేశ్వరరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, దాకా అంకిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట రమణారావుకు అభినందన



తెనాలి: పట్టణానికి చెందిన మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు విజయవాడలోని శ్రీకనకదుర్గ దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఆయన్ను హిందూ ధార్మిక సంస్థలు సత్కరించాయి. విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు కోట రాజేష్, కార్యదర్శి రామాంజనేయులు, హిందూ చైతన్య వేదిక సంయోజక పొట్టి మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొమ్మువానిపాలెంలో వింత పాములు ప్రత్యక్షం



కొల్లిపర: కృష్ణానదిలో వరద ఉధృతి కారణంగా బొమ్మువానిపాలెం గ్రామంలోకి మంగళవారం రెండు తలలతో ఉన్న వింత పాములు వరద నీటితోపాటు గ్రామంలోకి కొట్టుకు వచ్చాయి. వాటిని చూసి గ్రామంలో గతంలో ఎన్నడూ ఇటువంటి వింత పాములను చూడలేదని గ్రామస్తులు తెలిపారు. యువకులు ధైర్యం తెచ్చుకుని వాటిని ఒక గోనెసంచిలో బంధించి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి, వాటిని అప్పగించారు. గ్రామంలో రెండు తలల పాములు కన్పించాయన్న సమాచారం వ్యాపించడంతో చుట్టుపక్కల గ్రామాల వారు వాటిని చూడటానికి ఎగబడ్డారు. వాటిని ఫొటోలు తీసుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేట ఇందిరానగర్ కాలనీకి చెందిన 22 ఏళ్ల యువతి సెప్టెంబర్ 26న విజయవాడలో కోచింగ్‌కి వెళుతున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు మంగళవారం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'చలో గుంటూరు'కు తరలిన నేతలు

తెనాలి: ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పూనుకోవటాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తెనాలి నుంచి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్ము రాయల్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉన్నవ అనీష్, పట్టణ అధ్యక్షుడు బండ్లమూడి నాని, కొత్త మల్లికార్జునరావు, శెట్టి ఏసోబు, పిల్లి అజిత్, బొమ్మువానిపాలెం అనిల్ తదితరుల నాయకత్వంలో పలువురు ఉదయాన్నే గుంటూరు బయలుదేరి వెళ్లారు. అక్కడ జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తెనాలి: నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆరుగురు లబ్ధిదారులకు వైద్యచికిత్సల నిమిత్తం రూ.5,35,959 చెక్కులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, సహకార అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు పాల్గొన్నారు.



కొలకలూరులో కనకదుర్గ అలంకారంలో పార్వతీ దేవి



మహా దుర్గాదేవిగా బోసురోడ్డు వాసవి కన్యకాపరమేశ్వరి..




శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో చండికాదేవిగా..



దేవీచౌక్‌లో మహాకాళ దేవిగా రాజరాజేశ్వరిదేవి



మారీస్‌పేటలో మహాకాళీదేవి అలంకారం



నందివెలుగులో దుర్గాదేవిగా అమ్మవారు



కఠెవరంలో మహా దుర్గాదేవిగా..

దుర్గాదేవి నమోస్తుతే!

దసరా పర్వదినంలో భాగంగా నియోజకవర్గంలో దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజైన మంగళవారం పలు దేవాయాల్లో అమ్మవారు శ్రీదుర్గాదేవి, శ్రీమహాకాళి దేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు కొనసాగాయి.

– తెనాలి /తెనాలిటౌన్

పంట నష్టపరిహారం అందించాలి



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

దుగ్గిరాల: మినుము, కంద, పసుపు పంట రైతులు కృష్ణా నది ముంపునకు గురై దెబ్బతిన్నాయని, నష్ట పరిహారం అందించి రైతులను కష్టాల నుంచి విముక్తులను చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం పెదకొండూరు, వీర్లపాలెంలో కృష్ణానది ముంపునకు గురైన పంట చేలను కౌలు రైతు సంఘం జిల్లా నాయకుల పరిశీలించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ సుమారుగా మినుముకు రూ.10 వేలు, పసుపు సాగుకు రూ.40 వేలు ఖర్చు అయ్యాయని తెలిపారు. వరద ముంపు కారణంగా నీరు ఎక్కువ రోజులు నిలబడితే దుంప కుళ్లే ప్రమాదం ఉందని, పంట పూర్తిగా దెబ్బతిని పోతుందని చెప్పారు. పసుపు పంటకి రూ.50 వేలు, మినుప పంటకు రూ.10 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, మన్నవ నాగమల్లేశ్వర రావు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, యాకోబు, బుల్లాబ్బాయి, సుబ్బారావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

లక్ష్మీపురం: భార్యాభర్తల మధ్య మనస్పార్థలతో భర్త కనిపించకుండా పోవడంతో అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. శారదాకాలనీకి చెందిన చవన్‌గోపి, సండే మార్కెట్‌లో పాత బట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య గౌరితో మనస్పర్థలు రావడంతో నెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆచూకి తెలియక పోవడంతో భార్య గౌరి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ 0863–2231955, సీఐ ఆరోగ్య రాజు 8688831332 లకు సమాచారం అందించాల్సిందిగా కోరారు

ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఆలిండియా మోటార్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభించిందని, ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. వాహన మిత్ర పథకం కింద ఆటో డ్రైవర్లకు రూ. 15 వేలను ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటోడ్రైవర్లు స్వయం ఉపాధి పొందుతున్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో వీరికి బాడుగలు తగ్గాయన్నారు. ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర కింద 25 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వాహన కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రూ.4 లక్షలు సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో ఆటోలకు పార్కింగ్‌స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా శేఖర్‌బాబు, ఉపాధ్యక్షులుగా శివ, కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జోషి, కోశాధికారిగా మధుబాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, ఆటో డ్రైవర్లు సుశీల రావు, దాసు, కోటిబాబు, మరియబాబు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తాడేపల్లి రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేయనున్నారు. మంగళవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తాడేపల్లిలోని ఆయన నివాసం వద్ద లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండీ కేఎల్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సుమారు రూ.40 లక్షల విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందజేశామని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ట్రక్‌ను జెండా ఊపి ప్రారంభించారని, త్వరలో వీటిని అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, సంస్థ డైరెక్టర్ ప్రీతమ్‌రెడ్డి, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాకు లొంగుబాటు విధానాన్ని విడనాడాలి


మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

లక్ష్మీపురం: భారత దేశంలోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే దేశ వ్యవసాయ రంగానికి ఉరితాడు బిగించినట్టేనని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో అమెరికా సుంకాలు– దేశంపై ప్రభావం అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఆక్వా ఎగుమతులపై 60 శాతం అమెరికా సుంకాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 6.5 లక్షలు, మన రాష్ట్రంలో 4.5 లక్షల ఆక్వా రైతులు నష్టాలు చూస్తున్నారన్నారు. ఆక్వా అనుబంధ పరిశ్రమల్లోనూ లక్షల మంది ఉపాధి క్షీణిస్తుందని చెప్పారు. అదే విధంగా ఇండియాలో తయారయ్యే దుస్తుల్లో 65 శాతం అమెరికాకు ఎగుమతి అవుతాయని, ఇప్పుడు ఈ రంగం కూడా సంక్షోభంలో ఉందన్నారు. తాజాగా సినిమాలపై వందశాతం సుంకాలు ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా, డైమండ్స్, చెప్పులు, వ్యవసాయ రంగాలు కూడా నష్టపోతున్నాయన్నారు. అమెరికా సుంకాలను చైనా ధీటుగా ఎదుర్కొంటే భారత దేశం మాత్రం నోరుమెదపట్లేదని పేర్కొన్నారు. అమెరికా కోసం మోదీ దేశ ప్రయోజనాలను కూడా తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పుడు అమెరికాలో భారీగా పండించే మొక్కజొన్న అలాగే పాల పొడి, కాటన్‌ను దిగుమతి చేసుకోవాలనే షరతుకు భారతదేశం ఒప్పుకోవాలని ఒత్తిడి చేస్తుందన్నారు. ఇదే జరిగితే భారత దేశానికి కోలుకోలేని నష్టం జరుగుతందన్నారు. 60 శాతంపైగా ప్రజలు ఆధార పడిన వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొటుందని, గ్రామీణ ప్రజలు ఉపాధి కోల్పోతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అమెరికాతో అంటకాగే విధానానికి స్వస్తి పలికి మనకు సహకరించే దేశాలతో సంబంధాలు మెరుగుపరుచుకోవాలని, ముఖ్యంగా దేశీయ మార్కెట్లను అభివృద్ధి చేసుకోవాలని, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2016 ఎన్నికల నుంచే ట్రంప్ సంకుచిత విధానాన్ని పాటిస్తున్నాడని అన్నారు. ఒకప్పుడు ఫ్రీ ట్రేడ్ అని, ఇప్పుడు సుంకాలు వేస్తున్నారన్నారు. దేశాల మధ్య ఎగుమతులు, దిగుమతులు అవసరాల ప్రాతిపదికన కాకుండా రాజకీయ అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలనే దేశంలో మోదీ అనుసరిస్తున్నాడని అన్నారు. సుంకాల నేపథ్యంలో రాబోయే కాలంలో దేశానికి జరుగుతున్న నష్టాన్ని, పరిణామాలను ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు మనోధైర్యమే మందు



మాట్లాడుతున్న డాక్టర్ కోటేశ్వరరావు

గుంటూరు మెడికల్: ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న భూతం క్యాన్సరేనని, ఆ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం (సీజీహెచ్ఎస్) చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సి.హెచ్.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మంగళవారం గుంటూరు నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ కేంద్రంలో 'ఒమేగా హాస్పిటల్' వారి సౌజన్యంతో క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన, ఉచిత పరీక్షలు నిర్వహించారు. ప్రారంభోత్సవ సభలో డాక్టర్ టి.సిహెచ్. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి, క్రమరహిత ఆహారపు అలవాట్లు, జంక్ ఫుడ్ వినియోగం, కాలుష్యంతో క్యాన్సర్ కేసులు విజృంభిస్తున్నాయని పేర్కొన్నారు. చిన్న, పేద ధనిక, పల్లెలు, పట్నాలు అనే తేడా లేకుండా క్యాన్సర్ సునామి ప్రమాద ఘంటికలు మోగిస్తుందని చెప్పారు. క్యాన్సర్ భయం రోగి మనసును, శరీరాన్ని, ఆత్మను దెబ్బ తీస్తుందన్నారు. క్యాన్సర్ వ్యాధి సోకిన వారికి జీవితం మీద ఆశలు కల్పిస్తూ, వ్యాధి గ్రస్తుల్లో మనోధైర్యం నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. వ్యాధి నివారణ చికిత్సపై అవగాహన పెంచాలన్నారు. కుటుంబం, సమాజం, వైద్యులు క్యాన్సర్ రోగులకు ప్రతి దశ లో జయిస్తాననే మనో నిబ్బరం కలిగించాలని కోరారు. సరైన కౌన్సెలింగ్‌తో, రోగి మనసు, శరీరం, ఆత్మ కోలుకునే సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. క్యాన్సర్‌పై భయాన్ని తొలగించినప్పుడే, రోగి త్వరగా కోలుకోగలడని కోటేశ్వరరావు తెలిపారు. ఒమేగా హాస్పిటల్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ పి.గీతా రుక్మిణి మాట్లాడుతూ ప్రతి మహిళ ఎడాదికొకసారి రొమ్ము, గర్భాశయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ ముప్పును ముందుగానే గుర్తిస్తే, నివారణ అతి సులభమన్నారు. ఉచిత క్యాన్సర్ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 54 మంది మహిళలకు బ్రెస్ట్, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. సిజిహెచ్ఎస్ నర్సింగ్ ఆఫీసర్ హేమాసుందరి, ఫార్మాసిస్టులు అయేషా, సునీల్, సిబ్బంది కె. మురళీకృష్ణ, రామారావు, మోహన్, వెంకటేశ్వర్లు, మక్బుల్, రత్నరాజు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధుల నిలయాలు

- విష సర్పాలు, దోమలకు ఆవాసం
- తెనాలిలో 400లకు పైగా ఖాళీ స్థలాలు
- గతంలో చర్యలు.. ప్రస్తుతం పట్టించుకోని అధికారులు



బాలాజీరావుపేటలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ఖాళీ స్థలాల సమస్య జఠిలంగా మారుతుంది. ఇవి జనవాసాల మధ్య ఉండటం వల్ల వీటిలో విషసర్పాలు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే దోమలకు ఇవి నిలయాలుగా మారటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుండటం... అమరావతి రాజధానికి అతి సమీపంగా ఉండటంతో ఇక్కడ నివశించేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తిని కనపర్చుతూ ఉంటారు. అంతేకాకుండా తెనాలి పట్టణంలో తాగు నీటి కొరత కూడా ఉండదు. దీంతో పల్లెలలో నివశించేవారు, ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చిన వారు తెనాలిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం పట్టణంలో 1.60లక్షలకు పైగా జనాభా ఉన్నరంటే తెనాలి ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో మనకు అర్థమవుతుంది. జనాభా పెరిగిన రీతిలోనే స్థిర నివాసాలు పెరుగుతున్నాయి.

400లకు పైగా ఖాళీస్థలాలు..

తెనాలి పట్టణంలో ఇళ్ల మధ్య సుమారు 400కు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయనేది అధికారుల అంచనా. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు, పురుగులకు, పందులకు నిలయంగా మారుతున్నాయి. అంతేకాకుండా స్థలాలు పల్లంలో ఉండటం వల్ల సమీపంలోని మురుగు నీరు, వర్షపు నీరు దానిలో చేరి దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు తరచు వాటిని బాగు చేయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

గతంలో వేకెంట్ ల్యాండ్ యాప్‌తో చర్యలు..

తెనాలి మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను బాగు చేయించేందుకు వేకెంట్ ల్యాండ్ అనే ప్రత్యేక యాప్‌ను గతంలో రూపొందించారు. దానిలో ఖాళీ స్థలాలను నమోదు చేసి, వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని బాగు చేయించేవారు. యజమానుల ఆచూకీలేని స్థలాలను మున్సిపల్ సిబ్బందితో బాగు చేయించి దానికి అయిన ఖర్చును అందులో నమోదు చేసేవారు. ఎప్పుడైనా ఆ స్థల యజమానులు భవన నిర్మాణ ప్లాన్‌కు వచ్చినప్పుడు వారి నుంచి స్థలం బాగు చేయించినందుకు అయిన ఖర్చును వసూలు చేసి తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చి ప్లాన్ ఇచ్చేవారు. ఇలా మూడు సంవత్సరాలు జరిగిన తర్వాత దాని ఊసే అధికారులు మరిచారు. ఇదిఇలా ఉంటే గతంలో అధికారులు నోటీసులు ఇచ్చిన స్పందించిన యజమానులకు బుద్ధి చెప్పేందుకు వారి స్థలాలలో ఇది మున్సిపల్ స్థలం అనే బోర్డులు ఏర్పాటు చేశారు. ఆప్రక్రియ నేడు నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



విష సర్పాలకు నిలయంగా మారిన ఖాళీస్థలం

కఠిన చర్యలు తీసుకుంటాం..



పట్టణంలోని ఖాళీ స్థలాల యజమానులను గుర్తించే పనిలో ఉన్నాం. వారికి నోటీసులు ఇచ్చి బాగు చేయించాలని సూచిస్తాం. అప్పటికీ స్పందించకపోతే లీగల్‌గా వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– పినప శ్రీకాంత్, ఇన్‌చార్జి కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐకు సన్మానం

నగరంపాలెం: ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం విశేష కృషి చేశారని జిల్లా ఏఎస్పీ(పరిపాలన) రమణమూర్తి అన్నారు. ఎస్ఐగా ఉద్యోగ విరమణ పొందిన పి.ఆనంద్‌కుమార్‌ను మంగళవారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సత్కరించారు. కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా జీవించాలని పోలీస్ అధికారులు అన్నారు. ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, సురేష్, శ్రీనివాసరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ముగ్గురు ఎస్ఐలు

ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన ఎ.భాస్కర రావు, జి.ప్రసాద్, డి.శ్రీనివాసరావు మంగళవారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో సమర్థంగా విధులు నిర్వహించాలని ఎస్ఐలకు జిల్లా ఎస్పీ సూచించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జీఓను రద్దు చేయాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఇచ్చిన జీఓను వెంటనే రద్దు చేయాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శశికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణతో సంవత్సరానికి 127 మెడికల్ సీట్లు కోల్పోతారని, దీని వలన దళిత, గిరిజన విద్యార్థులు డాక్టర్లు అయ్యే పరిస్థితులు ఉండావని ఆందోళన వ్యక్తం చేశారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



గీతాలాపన చేస్తున్న గాయకుల బృందం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై దసరా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. సాయిమారుతీ భజన మండలి ఆధ్వర్యంలో జరగ్గా, పాలక మండలి నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయకులు వి.మల్లేశ్వరరావు బృందం పలుభక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై షరీఫ్, తబలాపై విజయ్‌పాల్ వాయిద్యాని అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

ప్రతి గ్రామ పంచాయతీకి కిసాన్ మోర్చా కమిటీ



మాట్లాడుతున్న చిగురుపాటి కుమార్ స్వామి

గుంటూరు మెడికల్: ప్రతి గ్రామంలో కిసాన్ మోర్చా కమిటీలు ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి కోరారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జోనల్ సమావేశాలు మంగళవారం నిర్వహించారు. కుమార్ స్వామి మాట్లాడుతూ మండల, జిల్లా స్థాయిలో బలమైన కమిటీలు ఏర్పడితేనే ప్రతి రైతు సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కష్టపడి పనిచేసే రైతు నాయకులను భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల్లోకి తీసుకుంటామని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కిసాన్ మోర్చా మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకుడు కొత్తూరు సుబ్బారావు మాట్లాడుతూ చిగురుపాటి కుమార్ స్వామి అనుభవజ్ఞుడైన నాయకుడు, ఆయన నాయకత్వంలో కిసాన్ మోర్చా గ్రామ స్థాయి వరకు పటిష్టంగా ఏర్పాటవుతుందని అభిప్రాయపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతుల సమస్యలు వినిపించేలా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో బలమైన కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ కమిటీల రాష్ట్ర కన్వీనర్ వై.వి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానాల తీర్పులను అమలుచేయండి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 301 రోజులుగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నేత కె. ఆదినారాయణ, కార్మికులు సుభాని, యహోషువా, రమాదేవి, శారమ్మ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com